


"అమ్మా!..."

"పడుకోమ్మా!...నిద్రపో!"

"నాన్నేరే?"

వస్తారులే అమ్మా! పడుకో! మా తల్లివి గాదూ! నిద్రపోమ్మా!"

చిట్టి ఈవేళ ఎంతసేపు జోకొట్టినా నిద్రపోవడం మానేసి నాన్న కావాలని ఏడుస్తూంది. చిట్టికి రోజూ తండ్రి కథలు, కబుర్లు చెబుతూంటే అలా వింటూ నిద్రపోవడం అలవాటు. నరసమ్మ కాపరానికి వచ్చిన ఆరేళ్లకి చిట్టి పుట్టింది. చిట్టికిప్పుడు నాలుగో ఏడు. లేక లేక కలిగిన సంతానం కావడంవల్ల చిట్టికి తల్లిదండ్రులు బాగా గారం చేశారు. చిట్టి తరవాత నరసమ్మకి మళ్లీ సంతానం కలగలేదు.

చిట్టి ఉలిక్కిపడి లేచి ఏడవడం మొదలుపెట్టింది. ఎంత ఊరుకోబెట్టినా ఊరుకోలేదు. జడుసుకుందో ఏమో! నరసమ్మ అమ్మవారికి పూజచేసిన కుంకం చిట్టి నొసటను పెట్టి, పిల్లను ఎత్తుకుని ఓదారుస్తూ అటూ ఇటూ తిరిగింది. పిల్ల "నాన్న నాన్న" అంటూ గుక్క పట్టిన ఆయాసంతో అలిసిపోయి మళ్లీ కళ్లుమూసింది. నరసమ్మ చిట్టిని మళ్లీ జాగ్రత్తగా మంచం మీద పడుకోబెట్టి చేతులతో మెల్లి మెల్లిగా తట్టుతూ జోకొట్టింది. చిట్టి నిద్రలో అప్పుడప్పుడు ఉలికి పడుతున్నది.

నరసమ్మకు కూడా ఆవలింతలు వస్తున్నాయి. రాత్రి ఒంటిగంట కావస్తున్నది. ఊరంతా మాటుమణిగింది. దూరంగా అప్పుడప్పుడు కుక్కలు మొరిగిన చప్పుడు వినవస్తున్నది. ఇద్దరు బంట్రోతుల్ని పిలిచి ఇంటికి కాపలా పెట్టి ఇనస్పెక్టరు వెంకటరావు సాయంత్రం పెందరాళ్లే భోజనం చేసి పోలీసులతో ఎక్కడికో వెళ్లిపోయాడు. మళ్లీ తిరిగి 10, 11 గంటల లోపుగానే వస్తానని చెప్పాడుగాని ఇంత వరకు తిరిగి రాలేదు. ఆయన మామూలు పొలాల్లో దాగి ఉన్న ఎవరిని పట్టుకోడానికి వెళ్లారో ఎవరికి తెలుసును!

వెళ్లేటప్పుడు నరసమ్మ ఈవేళ ఎప్పటికి తిరిగివస్తారని అడిగింది! యథాప్రకారంగానే వెంకటరావు చిట్టిని ఒకసారి ఎత్తుకుని ముద్దు పెట్టుకుని, చిరునవ్వు నవ్వుతూ సాధ్యమైనంత త్వరలోనే వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. నరసమ్మ గుమ్మందాకా వెళ్లి నిలబడింది. బంట్రోతులతో ఇల్లు భద్రమని చెప్పి వెంకటరావు పోలీసులతో చరచరా నడిచి వెళ్లిపోయాడు.

ఈ మధ్యన దోపిడీలు, గృహ దహనాలు ఎక్కువైన కొద్దీ ఆ ఊళ్లో అలజడి ఎక్కువగా ఉంది. ఆ ఊరు ఒక మారుమూల ఉన్న ఊరు. ఒక చిన్న పోలీసు స్టేషను ఉంది. ఊళ్లో చిన్న పోస్టాఫీసు ఒకటి ఉన్నా ఆ ఊరు నించి ఉత్తరం వేస్తే అది రెండు మూడు రోజులదాకా అసలు ప్రయాణమే మొదలు పెట్టదు. అక్కడక్కడ పల్లెటూళ్లలో జరుగుతున్న దారుణ కృత్యాలు విన్నప్పటినించీ నరసమ్మకు భర్త ఈ ఉద్యోగం చెయ్యడం చాల ప్రమాదకరమని తోచింది. అయితే ఉద్యోగం లేకపోతే రోజు గడవడం ఎలాగ? గత్యంతరం లేక మరిఒకచోటి కెక్కడి కైనా సురక్షిత ప్రదేశానికి వెళ్లిపోదామని ఆమె పట్టు పట్టింది. వినిపించుకోకపోతే సాయంత్రం భోజనాలవేళ మళ్లీ రెట్టించింది.

"ఇలాంటప్పుడు బదిలీ చెయ్యరంటే చెయ్యరు."

"ఏం?"

"ఇక్కడ ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని తెలిస్తే పైవారు మాత్రం ఇక్కడ బదిలీకి ఇష్టపడతారా?"

"పోనీ జబ్బుచేసిందని సెలవు పెట్టండి?"

"అతి కష్టంమీద సెలవు దొరుకుతుందే అనుకో! సెలవులయిపోయిన తరవాత మళ్ళీ ఇక్కడికే రావాలిగా!"

నరసమ్మకేమీ తోచలేదు. మళ్ళీ కొంతసేపూరుకుని అతని ముఖంకేసి చూసి ఇలాగ అంది.

"పోనీ, నేనూ చిట్టీ మా యింటికి వెళ్ళిపోతాము పంపించివెయ్యండి!"

"నేను కాదన్నానా! అసలు కాస్త మంచి రోజు కుదిరితే పంపించివేద్దామనే అనుకుంటున్నాను."

ఈ మాట అనేసరికి నరసమ్మ ఇక మాట్లాడలేక పోయింది. అసలు తానే పట్టుమని పదిరోజులపాటు ఆయన్ని విడచి ఉండలేదు! చిట్టి క్షణం నాన్న కనబడక పోతే నానా గందరగోళము చేస్తుంది. వెనక ఒకసారి బయలుదేరి పుట్టింటికి వెడితే వారం రోజులయ్యేసరికి చిట్టి జ్వరం పెట్టుకుని చిక్కి శల్యమైపోయింది. పట్టుమని పది రోజులైనా ఉండకుండా తిరిగి బయలుదేరవలసి వచ్చింది.

నరసమ్మ అల్లాగే ఆలోచిస్తూ మంచాని కానుకుని కునికిపాట్లు పడుతూంది. రాత్రి మాగపు పొలాలలోనుంచి కీచురాళ్ళమోత వినిపించేటంత నిశ్శబ్దంగా ఉంది.

ఒక్కసారిగా ఇరుగు పొరుగున ఉన్న కుక్కలన్నీ బొయ్యమన్నాయి. నరసమ్మ ఉలిక్కిపడిలేచి బంట్రోతుల్ని కేకేసింది. రెండోజాము నిద్రలో ఉన్నారేమో! వాళ్ళెవరూ పలకలేదు! వాళ్ళు గుర్రుపెట్టి నిద్రపోతున్న చప్పుడుమాత్రం స్పష్టంగా వినిపిస్తున్నది.

మళ్ళీ చెవులు గింగురుమనేటట్లు కుక్కలు మొరిగాయి. ఊళ్ళో దూరంగా పెద్ద కోలాహలం వినబడింది. కుక్కల మొరుగులు అంతకంతకు ఎక్కువౌతున్నాయి గాని తగ్గడం లేదు. నరసమ్మ గట్టిగా "వెంకన్నా!" అని బంట్రోతును కేకపెట్టింది. అరుగుమీద పడుకున్న బంట్రోతులు లేస్తున్నారో లేదో చూదామని ఆమె కిటికీ దగ్గరకు వెళ్ళింది. కిటికీ తలుపులు తెరిచిచూసింది. ఢామ్! ఢామ్! అని 5, 6 సార్లు తుపాకి మోతలు వినిపించాయి.

ఆ దృశ్యం చూసేసరికి ఆమెగుండె ఆగిపోయినట్లయింది. ఎదురుగా యాభై అరవైమంది, నల్లటి చొక్కాలు, లాగులు తొడుక్కుని చేతుల్లో కాగడాలు పట్టుకుని వస్తున్నారు. అందులో ఒకడు బూరాలో మూతిపెట్టి గట్టిగా "తలుపులు తెరవకండి! వీధుల్లో రాకండి! తలుపు తెరిస్తే తల లెగిరిపోతాయి." అని కేకలు పెడుతున్నాడు. కొందరి చేతుల్లో కత్తులు బల్లాలు కాగడాల వెలుతురులో తళతళ మెరిసిపోతున్నాయి. 'మరికొందరు తుపాకులు బుజాల మీద పెట్టుకున్నారు. వారందరు ఒకే క్రమంతో అడుగులు వేసుకుంటూ కాళ్లతో గట్టిగా చప్పుడు చేసుకుంటూ నడిచి వస్తున్నారు. ఆమె గట్టిగా కేకలువేసి బంట్రోతుల్ని పిలిచింది. వాళ్లెవ్వరూ పలకలేదు. రెండోవైపునున్న మరో కిటికీ తెరిచిచూసింది! ఇంతవరకు అరుగుమీద పడుకుని ఉన్న బంట్రోతు లెవ్వరూ కనబడలేదు. ఒక్కసారిగా ఆమె మనస్సులో వాళ్లు తమ ప్రాణాలు దక్కించుకోడానికి పారిపోయిన సంగతి మెరుపులా మెరిసింది. ఆమెకు మరి కాళ్ళాడలేదు! భయంతో నోరార్చుకుపోతు నాలుక పిడచ కట్టుకుపోతూన్నట్లనిపించింది. ఆ తరవాత ఆమె చిట్టిని కదలకుండా జాగ్రత్తగా మంచంకింద పడుకోబెట్టి పిల్ల కనబడకుండ దుప్పటీ మంచంకోళ్ళ కిందికి దిగజార్చింది. మళ్ళీ చిట్టిని ముద్దుపెట్టుకుని నిశ్శబ్దంగా ఏడుస్తూ మంచం కోడుదగ్గిర బిక్కుమంటూ కూర్చుంది. భయంచేత ఆమె కాసమయంలో ఆలోచించే శక్తికూడా నశించి పోయింది...

ఇంతలో ఎవరో దబదబా తలుపు కొట్టారు!

"తలుపు! తలుపు!" పిక్కటిల్లగా తలుపులమీద ఒక వంద తాపులు వినిపించాయి! తరవాతి ఒక పెద్ద దుంగతో తలుపులమీద మోదిన చప్పుడు... తలుపులు తటాలున ఊడి

చెరి ఒక పక్కకీ పడిపోయాయి! బిల బిలమని కాగడాలతో 50, 60 మంది లోపలికి ప్రవేశించారు.

ఆమె భయంతో గోడను ఒక మూలగా కూలబడి పోయింది.

“ఇనస్పెక్టరెక్కడ దాక్కున్నాడు?” అని ఒక కర్కశ స్వరం అడిగింది.

“దాక్కోలేదు! పోలీసుల్ని తీసుకుని ఎక్కడికో వెళ్ళిపోయారు!”

“నిజం చెప్పు.” చింతనిప్పుల్లా ఎర్రగా మెరుస్తున్న రెండు కళ్లు ఆమెను గద్దించి అడిగాయి!

ఆమె చేతులు జోడించి దీనంగా నిజమే చెబుతున్నానని సమాధానం చెప్పింది.

ఒక తర్జని భయంకరంగా ఆమెను నగలన్నీ ఒలిచి ఇమ్మని ఆజ్ఞాపించింది.

ఆమె కిక్కురు మనకుండా నగలన్నీ ఒలిచి ముందు పెట్టింది. ఈలోగా బాటరీలైట్లు కొన్ని విద్యుద్వీక్షణాలతో ఇల్లు నాలుగు మూలలా గాలించాయి.

మళ్లీ కర్కశమైన ప్రశ్న—

“పిల్లనెక్కడ దాచావు?”

ఆ ప్రశ్నతో ఆమె హృదయంలో రక్తం గడ్డకట్టుకు పోయింది. ఆమె హీన స్వరంతో సమాధానం చెప్పింది.

“దాచలేదు! వాళ్ళ బామ్మగారింటిదగ్గర ఉంది!”

“అబద్ధాలాడుతున్నావు! చెబుతావా? ఒక్క పోటు పొడిచెయ్యమన్నావా?”

ఆమె జాలిగా ఏడుస్తూ అతని కాళ్ళమీద పడింది. ఈ గల్లంతులో మంచంమీద పడుకున్న పిల్లలేచి పెద్దగా ఏడవడం మొదలుపెట్టింది.

అతను జబ్బ పట్టుకొని ఆమెను గోడ కానించి కూర్చోబెట్టి, రోజుతూ, ఆమెకేసి తీవ్రంగా చూసి మళ్లీ ప్రశ్నించాడు.

“దొంగా! నాతో అబద్ధం చెబుతావా? ఇనస్పెక్టరెక్కడ దాక్కున్నాడో చెప్పు!”

ఆమె గోలున ఏడుస్తూ అతి దీనంగా ఇనస్పెక్టరు పోలీసులతో వెళ్ళిపోయిన విషయం రెట్టించి చెప్పింది.

అతను పిస్తోలుతీసి నుదుటిమీద ఉంచి “ఇప్పుడైనా నిజం చెబుతావా? చంపెయ్యనా?” అని గద్దించాడు.

ఆమెకు సమాధానం చెప్పే ఆలోచనా శక్తి కొద్దిగా క్షీణించింది. మళ్ళీ చేతులు జోడించి అతని కాళ్లమీదపడి ఏడుస్తూ దయాభిక్ష వేడింది. ఉత్తర క్షణంలో ధామ్మని పేలిన పిస్తోలు ధ్వనితో ఆమె రోదనము వెనువెంటనే జీవము అంతరించాయి. పిమ్మట ఊరంతా దద్దరిల్లేటట్లు ప్రతిధ్వనించే విప్లవ నినాదాలతో ఆ విప్లవకారులు ఆకాశాంచలాలలో క్షణకాలం తమ ఆదర్శ రాజ్యం నిర్మించారు! ఆ తరవాత వారు సక్రమ పాద విన్యాసాలతో ఊరువాటి అంధకారంలో లీనమైపోయారు.

దయాభిక్షకోసం జోడించిన హస్తాలతో అలాగే కొయ్యబారిపోయిన ఆమె కళ్లు శూన్యంకేసి నిరీక్షిస్తూ నిలిచిపోయాయి. చిన్నపిల్ల నేలమీదపడి ఏడుస్తూంటే ఒక ఎలుకపిల్ల అక్కడికివచ్చి, ముని కాళ్ళమీద నిలబడి ఆపిల్లకేసి చూసి, తిరిగి తన దారిని వెళ్లిపోయింది.

